నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఈ లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాగా టూల్స్ సెక్షన్ గిరినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గిరినగర్, టీడీపీ ఆఫీస్ శ్రీనివాస టవర్స్, హనుమాన్ టెంపుల్, ఏపీహెచ్‌బీ కాలనీ, సుమిత్రనగర్‌లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే ప్రాగాటూల్స్ సెక్షన్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అస్‌బెస్టాస్ హిల్స్, రంగారెడ్డి నగర్, రసూల్ ఫార్మా, ప్రగతి ప్యాక్, అరుణాచలం ఫీడర్, టీసీ బాలనగర్, గ్లోబల్ హోమ్స్ ఫీడర్ల పరిధిలోకి గాంధీనగర్ శివాజీ స్టాచ్యూ, ఆల్ఫా కాంప్లెక్స్, ఈశ్వర్ విమల్ గిరినగర్, ఆర్‌ఆర్ నగర్, నాగార్జున సిగ్నోడే, నెక్స్‌ట్ ఎలక్ట్రికల్స్, రాజ్ ఫుడ్, టెక్నో ఎలక్ట్రికల్స్, బాలాజీ ఎలక్ట్రికల్స్, రంగారెడ్డి నగర్, శ్రీ సాయి రెసిడెన్సి, బాలానగర్, ఐడీపీఎల్, పూజా ఇండస్ట్రీస్, ఆగ్రో ఇండియా ఇంజినీరింగ్, గ్లోబల్ హోమ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



చండీ హోమంలో కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: బాచుపల్లిలోని దేవీహోమ్స్ అపార్ట్‌మెంట్స్ శ్రీకార్య సిద్ధి గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, చండీ హోమం చేపట్టారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మురళి, మధు, రాజ్‌కుమార్, నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొలన్‌జీవన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గణేశ్, బోయిని వెంకటేశ్, రాజ్‌పాండు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జీడిమెట్ల: అల్లూరి విప్లవజ్యోతి అల్లూరి ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు జంగా తాతాజీ కుమార్తె తులసీలక్ష్మి పుట్టినరోజును పురస్కరించుకుని హెచ్‌ఎంటీలోని నిర్మాన్ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పాని నరసింహ, సభ్యులు చిన్నా, నాగరాజు, రమేశ్, సతీశ్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశం

కుత్బుల్లాపూర్: చింతల్ హెచ్‌ఎంటీ మైదానంలో రెండురోజులుగా కొనసాగిన హెచ్‌ఎంటీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. మొత్తం ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో మజిసా క్రికెట్ క్లబ్, ప్రకాశ్ 11 జట్లు ఫైనల్ కు చేరాయి. శుక్రవారం జరిగిన ఫైనల్‌లో ప్రకాశ్ 11 జట్టు విజేతగా నిలిచింది. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాగరాజు, ఫయాజ్, జీడిమెట్ల ఎస్ఐ ప్రేమ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయం



టెన్త్ విద్యార్థులకు ఫీజులు అందజేస్తున్న విజయ్‌కుమార్

సుభాష్‌నగర్: నిరుపేద విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ ఎంఈవో జెమిని కుమారి అన్నారు. నెహ్రూనగర్ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 11 మంది ఒంటి తల్లి/తండ్రి ఉన్న విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష ఫీజు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని, సయ్యద్‌సాజిత్ అందించిన ఆర్థిక సహాయంతో ఫీజులు అందించామన్నారు. సొసైటీ సభ్యుడు రవినాయక్, సామాజిక వేత్త మధుబాబు చికిలే, ఉపాధ్యాయులు శ్రీశైలం, పద్మ ప్రియ, రాజమణి, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

27న భగత్‌సింగ్ మేనల్లుడి రాక



జగద్గిరిగుట్ట: ఈనెల 27న కుత్బుల్లాపూర్ మండలంలో భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ పర్యటించనున్నట్లు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్ పేర్కొన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జగద్గిరిగుట్టలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కుత్బుల్లాపూర్ మండలంలోని జగద్గిరిగుట్ట, గాజులరామారంలో జగన్మోహన్ సింగ్ పర్యటించనున్నారని భగత్‌సింగ్ అభిమానులు, నాయకులు పార్టీలకు అతీతంగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా భగత్‌సింగ్ చరిత్రను అందరికీ తెలిసేలా విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తిత్వ, పాటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య కార్యదర్శి వెంకటేశ్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో యువజన నాయకులు బాబు, రాంరెడ్డి, సీపీఐ కార్యదర్శి ఉమా మహేశ్, సహాయ కార్యదర్శి దుర్గయ్య, కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, నర్సయ్య, రాములు, శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు మహర్దశ..

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పడుతున్నది. సర్కారు విద్యను బలోపేతం చేసేందుకు ఇప్పటికే అనేక చర్యలు చేపడుతోంది. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని వడ్డించి, ఏక రూప దుస్తులను అందజేస్తున్న సర్కారు ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టింది. బడులను బాగుచేయాలన్న లక్ష్యంలో భాగంగా మన ఊరు-మనబస్తీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కింద మౌలిక వసతులను కల్పించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించి, నెలకు రూ.39 లక్షలు అందచేస్తోంది. అలాగే, బడులకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తోంది. దీంతో మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రత, పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.



మనఊరు- మన బడి కింద 150 పాఠశాలల్లో పూర్తయిన పనులు

- బడుల్లో అదనపు గదులు, మౌలిక వసతుల కల్పన
- అమ్మ ఆదర్శ కమిటీల అధ్వర్యంలో 286 బడుల్లో అత్యవసర పనులు
- పారిశుద్ధ్య నిర్వహణకు నిధులతో సహా విద్యుత్తు బిల్లులు

కార్పొరేట్‌కు దీటుగా

మన ఊరు-మనబస్తీ-మన బడి కింద సర్కారు బడులను కార్పొరేటు దీటుగా తీర్చిదిద్దారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, గ్రీన్ బోర్డులు, మరమ్మతులన్నీ పూర్తి చేశారు. 182 ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల సమస్యల్ని గుర్తించిన యంత్రాంగం 150 బడుల్లో రూ. 65 కోట్ల నిధుల కేటాయింపుతో అభివృద్ధి పనులకు జిల్లా విద్యాశాఖ చేపట్టింది. మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, వంట గదులు, భోజనశాలలు వంటి నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేర్చగా, భవనం మరమ్మతులు వంటి వాటి కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గం, జిల్లా అభివృద్ధి నిధులను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. నీటి వసతి తదితర మౌలిక వసతులు, స్థానిక అవసరాల కోసం కూడా నిధులు కేటాయించారు. ఇందులో పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులను భాగస్వామ్యం చేసింది.

బడులకు ఉచిత వెలుగులు

ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రాథమిక తరగతుల నుంచి డిగ్రీ, సాంకేతిక కళాశాలలకు ప్రయోజనం చేకూరుతోంది. దీని కోసం విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. విద్యా సంస్థలు ఏ శాఖ పరిధిలోకి వస్తే ఆ శాఖ ఉన్నతాధికారికి పోర్టల్ లాగిన్ సదుపాయం కల్పించారు. శాఖ పరిధిలోని విద్యా సంస్థల వివరాలను వెబ్ పోర్టల్‌లో చేర్చడం, తొలగించడం, సవరణకు అవకాశం కల్పించారు. ఉచిత విద్యుత్ నేపథ్యంలో వచ్చిన విద్యుత్ బిల్లును విద్యా సంస్థలు చెల్లించకుండా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఆ శాఖకు ప్రతి నెలా డిస్కమ్‌లకు చెల్లిస్తున్నారు. ఇందుకు వీలుగా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో అనుసంధానించారు. ఈ లెక్కన ప్రభుత్వ విద్యా సంస్థలకు రూ. లక్షల్లో ఆర్థిక భారం తప్పింది. మేడ్చల్ జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు, 3 డిగ్రీ, 5 జూనియర్ కళాశాలలు, ఒక ఒకేషనల్ కళాశాల, స్పోర్ట్స్ అథారిటీ కళాశాల, 6 సాంఘీక సంక్షేమ కళాశాలలు, 2 గిరిజన సంక్షేమ కళాశాలలు, 6 మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ కళాశాలలు, 8 మైనార్టీ సంక్షేమ కళాశాలలకు ఉచిత విద్యుత్ వసతి లభిస్తోంది.



286 బడుల్లో రూ. 12 కోట్లతో అత్యవసర పనులు

మేడ్చల్ జిల్లాలో 286 ప్రభుత్వ బడుల్లోనే 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల పర్యవేక్షణలో అత్యవసర పనులను రూ.12 కోట్లతో చేపట్టారు. మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పది రకాల అత్యవసర పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, విద్యుత్తు, ఆర్‌అండ్‌బీ, ఈడబ్ల్యూఐడీసీ, టీఎస్ఈడబ్ల్యూ, ఓడీసీ విభాగాల ఇంజినీరింగ్ శాఖలు పూర్తి చేశాయి. జిల్లాలో 15 మండలాల పరిధిలోని 286 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు గుర్తించిన 699 అత్యవసర (ఎమర్జెన్సీ) పనులకు ప్రభుత్వం రూ.12,01,51,500 ఖర్చు చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర పనులైన విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతరత్రా మేజరు, మైనర్ మరమ్మత్తులు చేపట్టారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధులు

ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సర్కారు ప్రత్యేక నిధులు అందజేస్తోంది. దీంతో గ్రామ పంచాయతీ, పురపాలక పారిశుద్ధ్య సిబ్బందికి ఉపశమనం లభించింది. ప్రత్యేక నిధులను నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో జమ అవుతున్నాయి. 3 నెలల నిధులను ముందే వారి ఖాతాలలో జమ చేసేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 96,284 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో పాఠశాల పరిసరాలను అందంగా ఉంచటంతోపాటు మరుగుదొడ్లను శుభ్రపరచటం, మొక్కలకు నీళ్ల పెట్టడం తదితర పనుల్ని నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో శుభ్రత కోసం అవసరమైన వస్తువులకు కూడా సమగ్ర శిక్ష నిధులను వెచ్చిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో మంచి ఆదరణ



కరోనా కష్టకాలం నుంచి ప్రభుత్వ బడులకు ఆదరణ పెరిగింది. సర్కారు విద్య బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తిని చూపుతున్నారు. ఆంగ్ల విద్య ప్రవేశంతోపాటు మధ్యాహ్న భోజనం, ఏకరూపు దుస్తుల పంపిణీ, మన బడి-మనబస్తీ-మన ఊరు, అమ్మ ఆదర్శ కమిటీలతో బడుల్లో మౌలిక వసతులు కల్పన వంటి పనులు సర్కారు పాఠశాలలకు ఆదరణ పెంచింది. సీఎస్ఆర్ నిధులతో బడుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. పారిశుద్ధ్య నిర్వహణ, ఉచిత కరెంట్ సరఫరా వంటి కార్యక్రమాలు ప్రభుత్వ విద్య మరింత బలోపేతం చేస్తోంది. బడిబాటలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

– మేడ్చల్ జిల్లా, డీఈఓ. విజయకుమారి

మర్యాదపూర్వక కలయిక

దుండిగల్: మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజలు, సంక్షేమ సంఘం సభ్యులు శంభీపూర్ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అదే విధంగా పలు శుభకార్యాల వేడుకలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సత్కరిస్తున్న సంక్షేమ సంఘాల సభ్యులు

నిజాం మేయర్‌ను..

నిజాంపేట్: నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డిని ప్రతినగర్ రెడ్డి సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 24 న బాచుపల్లిలోని వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట ఉన్న లహరి గ్రీన్‌పార్క్‌లో నిర్వహించనున్న రెడ్డి వన భోజనాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాంబశివారెడ్డి, రెడ్డి సంఘం నాయకులు ఉన్నారు.



మేయర్ నీలారెడ్డిని ఆహ్వానిస్తున్న రెడ్డి కుల సంఘం నాయకులు

ఉచిత వైద్య సదుపాయాలు అందించాలి

దుండిగల్: ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉచితంగా వైద్య సదుపాయాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపల్లి మదన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో దుండిగల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 నెలల డీఏలతో పాటు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, అలాగు సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ప్రేంకుమార్, గౌడుగు శ్రీనివాస్, కూకట్‌పల్లి అధ్యక్షుడు విఠల్ గౌడ్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ దుండిగల్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ భిక్షపతి, మండల అధ్యక్షుడిగా బీ హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శిగా బీ రాజా, ఉపాధ్యక్షుడిగా ఎం. జైతఈశ్వర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వై.శ్రావణి, కోశాధికారిగా పీ తిరుపతి, కార్యదర్శులుగా మల్లేశప్ప, సీహెచ్ నారాయణరావు, కన్వీనర్‌గా టీ రామ చంద్రుడు, మహిళా విభాగం కన్వీనర్‌గా ఆర్. సీతా మహాలక్ష్మిని ఎన్నుకున్నారు.

మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియామకం



బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లికి చెందిన బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బీ వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్‌తోనే శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. విద్యార్థి దశ నుంచే పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. 2001లో వార్డు సభ్యుడిగా, 2006-11 వరకు డి.పోచంపల్లి ఉప సర్పంచ్‌గా పనిచేశారు. అదేవిధంగా 2015 వరకు ఉమ్మడి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా కొనసాగారు. బీఆర్ఎస్ హయంలోనూ 2020లో తన భార్యను కౌన్సిలర్‌గా గెలిపించుకున్నారు. కాగా తనకు పదవి అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు కాంగ్రెస్ నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



జీడిమెట్ల జడ్పీ స్కూల్ 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల జడ్పీ పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై వారు కలుసుకోవడంతో యోగక్షేమాలు అడిగి తెలుసుకుని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే ఆట పాటలతో ఉత్సాహంగా గడిపి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఇకనుంచి యేటా కలుసుకుంటామని విద్యార్థులు పేర్కొన్నారు.

రేపు కార్తీక దీప మహోత్సవం

సుభాష్‌నగర్: కార్తీక మాసం సందర్భంగా సుభాష్‌నగర్ డివిజన్ సూరారంలోని రామ్‌లీలా మైదానంలో ఈనెల 18న కార్తీకదీపం మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు రామ్‌లీలా మైదానం ఉత్సవ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. సోమవారం సాయంత్రం 5.30 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం అన్నదానం , 21సార్లు హనుమాన్ చాలీసా, సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తల ప్రసంగం ఉంటుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

నిజాంపేట్: బాచుపల్లి డివిజన్ లక్ష్మీకాలనీలో బసవ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహించారు. అనంతరం భక్తులకు, స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కార్పొరేటర్ కాసాని సుధాకర్‌ముదిరాజ్, కాసాని సతీశ్‌ముదిరాజ్, బాలకృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు



జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పార్టీలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలం గౌడ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల ఆధునికీకరణతో పాటు ఇతర ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. రంగారెడ్డి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు కోటేశ్వర రావు, బండి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేకే సొసైటీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధూలపల్లిలోని రేణుకా ప్లాస్టిక్స్ కంపెనీ రోడ్డు, జేఎస్‌డబ్ల్యూ రోడ్డు, 11కేవీ ధూలపల్లి ఐడీఏ-2 ఫీడర్ పరిధిలో ధూలపల్లి అయ్యప్ప ఆలయం, ఎంపీటీ కాలనీ, ఎస్‌వీఎస్ కాంటా ఎదురుగా ధూలపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలోని రోడ్డు నెంబర్లు 1, 2, 5, 6, 10, 14, 16 లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

లింక్ రోడ్ల నిర్మాణంతో ఎంతో మేలు



సుభాష్‌నగర్‌లో లింక్ రోడ్డు రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: లింక్ రోడ్ల నిర్మాణం పూర్తిచేసి ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) లింక్ రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ.29 కోట్లతో సుభాష్‌నగర్ ఫాక్స్‌సాగర్ నుంచి రామిరెడ్డినగర్ ఇండస్ట్రియల్ ఏరియా వరకు చేపడుతున్న లింక్ రోడ్డు పనులను హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింకు రోడ్ల నిర్మాణంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు సమీప ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. హెచ్‌ఆర్‌డీసీఎల్ సీఈ శ్రీనివాస్, ఈఈ విజయ్ కుమార్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ సురేందర్‌రెడ్డి, న్యాక్ ఇంజినీర్ జయశ్రీ, విజయ్ కుమార్, విఠలయ్య, హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు జెరేమయ్య, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు. ఇదిలాఉంటే కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్ -1, పద్మానగర్ ఫేజ్ -2 సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వక్ఫ్ బోర్డు సమస్యతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మళ్లీ పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సోమవారం వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో మొత్తం 115 పరీక్షా కేంద్రాల్లో 65,361 మంది అభ్యర్థులు హాజరు కానుండడంతో అందుకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గ్రూపు-3 పరీక్షలు రెండు సెషన్లుగా జరగనున్నాయి. పేపర్-1, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2, మధ్యాహ్నవ 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 18 న పేపర్-3 పరీక్ష ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ముందస్తు సెషన్‌కు సంబంధించి అభ్యర్థులు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారన్నారు. పరీక్షా కేంద్రం ప్రధాన గేట్‌ను ముందస్తు సెషన్‌కు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారన్నారు. గేట్లు మూసివేసిన తర్వాత అభ్యర్థులెవ్వరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. పరీక్షలకు సంబంధించి మొదటి సెషన్‌కు ఉపయోగించిన హాల్ టికెట్ కాపీని మిగిలిన సెషన్‌లకు ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్లు, అన్నీ సెషన్ల ప్రశ్నా పత్రాలను భద్రపరచుకోవాలని సూచించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే అభ్యర్థులు టీజీపీఎస్‌సీ టెక్నికల్ హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు 040-23542185 లేదా 040- 23542187లో సంప్రదించవచ్చన్నారు. హెల్ప్ డెస్క్‌ను పని దినాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు.



మెడల్స్‌తో చిన్నారులు

క్రమశిక్షణతో మెలగాలి

జీడిమెట్ల: చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో పాటు పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు లయన్ సురేశ్ కుమార్, కాలనీ అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. సుభాష్‌నగర్‌లోని బోధివృక్ష పాఠశాలలో శనివారం బాలల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే చిన్నారులు నిర్వహించన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు వెంకటరెడ్డి, భార్గవిరెడ్డి, ఉపాధ్యాయులు శిరీషా, రాధిక పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు